763) దేసాళం / కాపీ

ప॥ జోజో యని మీరు జోల పాడరో । సాజపు జయంతి నేడే సఫలమిందరికి ॥

చ॥ అదె చంద్రోదయమాయ హరి యవతారమందె । మొదల జాతకర్మములు సేయరో ।
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి । కదిసి యిట్టె నామకరణము జేయరో ॥

చ॥ కాయము దేవకి కిచ్చి గక్కన వాసుదేవుని- । కీయరో గంధాక్షత లిటు విడేలు ।
కాయకపుగాడిదెకు కవణము వెట్టి మరి । వీయపుచుట్టాలెల్ల వీడువెట్టరో ॥

చ॥ షోడశోపచారముల జొక్కించి శ్రీవేంకటేశు- । బాడరో ధర్మము నిల్పె భార మణచె ।
వోడించె గౌరవదానవుల గంసాదుల జంపె । ఆడనే పాండవుల గాచెనని యర్ఘ్యమియ్యరో ॥